# 'నేను' అనేదే దైవత్వం

**మంచికాలము పదవులు మంచి బ్రతుకు**
**కోరుచుందురు మనుజులు, కోరబోరు**
**మంచిబుద్ధులు జ్ఞానంబు మంచినడత**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?**

*ప్రేమస్వరూపులారా!* ఈ జగత్తులో పామరుడు మొదలుకొని పరమహంసవరకు, కూటిపేద మొదలుకొని కోటీశ్వరునివరకు ప్రతి వ్యక్తి తనను తాను పరిచయం చేసుకునేటప్పుడు 'నేను' అనే పదాన్ని ఉపయోగ పెడుతున్నాడు. పశుపక్షిమృగాదులకు మాటలు వచ్చియుండిన యెడల అవికూడా 'నేను' అనే పదమును ఉచ్చరించేవి. 'నేను' అనే తత్త్వమును గురించి ఉపనిషత్తులలో వివరింపబడింది. ఇది ఆధ్యాత్మిక సంస్కృతిలో ప్రధానమైనది. "అహం బ్రహ్మాస్మి" అనేది ఉపనిషత్ వాక్యము. ఇక్కడ 'అహం' (నేను) వచ్చిన తరువాతనే బ్రహ్మ అనే పదము వస్తున్నది. రామకృష్ణాది అవతారములకు ఆయా పేర్లు పెట్టినవేగాని, అవి వారి నిజతత్త్వమును నిరూపించునవి కావు. వారియొక్క సత్యమైన, నిత్యమైన పేరు 'అహం' (నేను). ఇదే భగవంతునియొక్క మొట్టమొదటి పేరు. మిగిలిన పేర్లన్నీ భక్తులు వారివారి సంతృప్తికొరకై, ఆనందమునకై, ప్రాకృతమైన జగద్వ్యవహారమునకై పెట్టుకొన్నవే. ఇట్టి భ్రాంతికి మూలకారణం మనస్సే.

*మ్రానుదిద్దవచ్చు మరి వంపు లేకుండ*
*దిద్దవచ్చు రాయి తిన్నగాను*
*మనసు దిద్దగలర మరి వంపు లేకుండ?*
*ఉన్నమాట తెలుపుచున్న మాట*

sri sathyasai vachanamrutam

మనస్సును సత్క్రమమైన మార్గములో పెట్టుకోవడమే సాధనయొక్క ప్రధానమైన లక్ష్యము. లోకంలో అనేకమంది అనేక సాధనలు సల్పు తున్నారు. అవన్నీ కేవలం తాత్కాలికమైన మానసిక తృప్తినందిస్తాయి. 'నేను' అనే తత్త్వమును గుర్తించినప్పుడే నిజమైన తృప్తి లభిస్తుంది. మానవుడు భగవత్తత్త్వాన్ని గుర్తించుకోలేక భగవంతునికి అనేక రూపనామములను కల్పించి ఆరాధనలు సల్పుతున్నాడు.

*బ్రహ్మాండమంతయు ప్రబలుచుండెడి తనకు*
*ఆలయంబు నమర్చ అలవియగున?*
*సర్వజీవులయందు సంచరించెడి తనకు*
*సరియైన పేరిడ సాధ్యమగున?*
*సర్వజలంబుల సంచరించెడి తనకు*
*స్నానంబు చేయింపనలవి యగున?*
*కోటిసూర్యుల కాంతి మేటి కల్గిన తనకు*
*ప్రమిద దీపము నెట్లు పెట్టగలరు?*
*బ్రహ్మాండమంతయు బొజ్జలో నుండగ*
*భక్ష్యభోజ్యము తనకు పెట్టతగున?*

వేదము "ఏకోహం బహుస్యాం", "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" అని ప్రబోధిస్తోంది. ఉన్నది ఒక్కటే, అదే 'అహం.' ఈ 'అహం'కు అనేక విధములైన రూపనామములను కల్పించేది మనస్సే. ఈ మనస్సు అనేక రకములైన ఆటలాడుచున్నది. మనస్సును పట్టుటకు ఎవరి తరమూ కాదు. ఈగలు, దోమలు అన్నింటిపైన వ్రాలుతాయిగాని, అగ్నిదగ్గరకు మాత్రం పోవు. అదేవిధంగా, మనస్సు సర్వత్రా సంచరిస్తుందిగాని, దైవముపై మాత్రం నిలువదు. మానవుడు ముఖ్యంగా చేయవలసిందేమిటంటే, మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా, నిస్స్వార్థంగా దైవముపై నిలుపుకోవడానికి కృషి చేయాలి. అదే నిజమైన సాధన. "*శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాద సేవనం వందనం అర్చనం దాస్యం స్నేహమాత్మనివేదనమ్*" అనే నవవిధ భక్తిమార్గములందు మనస్సును దైవార్పితం గావించడమే ప్రధానమైనది.

sri sathyasaivachanamrutam

(స్వామి తమ చేతిరుమాలును చూపిస్తూ) ఇది ఏమిటి? అని అడిగితే, 'వస్త్రము' అంటావు. ఈ వస్త్రములో అనేక దారములు ఇమిడియున్నాయి. ఈ దారములలో ప్రత్తి చేరియున్నది. అదే విధంగా, నీలోనూ మూడు తత్త్వములు చేరియున్నాయి. 1. నీవనుకునే నీవు (దేహము) 2. ఇతరులనుకునే నీవు (మనస్సు) 3. అసలైన నీవు (ఆత్మ). ఆ ఆత్మయే 'నేను'. అదియే బ్రహ్మము, అదియే దైవము. దైవమునకు ప్రత్యేకంగా ఒక పేరు లేదు, రూపం లేదు. దైవానికి ఏదో ఒక రూపము కల్పించుకొని మానవుడు సంతృప్తి నొందుతున్నాడుగాని, నిజంగా చూస్తే అన్ని రూపములూ దైవానివే.

**బలిచక్రవర్తి - వామనమూర్తి**

బలిచక్రవర్తి మహాత్యాగి, పరమ భక్తుడు. అతనివద్దకు శ్రీమన్నారాయణుడు వామనరూపుడై వచ్చి మూడడుగుల నేల దానం అడిగాడు. పక్షివాహనుడైన హరి తన వక్షస్థలమునందే లక్ష్మి ఉన్నప్పటికీ బలివద్దకు వెళ్ళి భిక్షమెత్తాడు. అయితే, తాను అంతటి చిన్నరూపమును ఎందుకు ధరించవలసివచ్చింది? భిక్షమడిగేవాడు చిన్నవాడేగాని, పెద్దవాడు కాజాలడు కదా! కనుకనే, శ్రీమన్నారాయణు డంతటివాడుకూడా బలిచక్రవర్తివద్దకు భిక్షమడగడానికి వచ్చినప్పుడు చిన్నవాడైపోయాడు. ఆ చిన్నవాని పాదములు మరింత చిన్నవి. కేవలం మూడడుగులనేల మాత్రమే అడిగాడు. ఆ మూడడుగులతో ముల్లోకాలనూ సాధించాడు. భగవంతుడు అనంత శక్తిమయుడు. అతనికి అసాధ్యమేమున్నది?! శుక్రాచార్యుడు వచ్చి, "బలీ! ఇతను సామాన్యుడు కాడు, సాక్షాత్తు శ్రీమన్నారాయణమూర్తి. కాబట్టి, ఇతడు అడిగినదీయవద్దు", అని హెచ్చరించాడు. కాని బలిచక్రవర్తి, "గురుదేవా! మాట తప్పేనేని మరి నరుడవుతాడా? నేను ఇస్తానని మాటిచ్చాను. కాబట్టి ఏమైనా సరే, నా మాటను నిలబెట్టుకుంటాను" అని పలికాడు. వామనుడు కోరినట్లుగా తాను మూడడుగులనేల దానమిచ్చాడు. ఏమిటా మూడడుగులు? "భూః భువః సువః". "భూః" అనగా పదార్థమయమైన ఈ ప్రపంచము. దీనిని వామనుడు ఒక్క అడుగుతో ఆక్రమించాడు. "భువః" అనగా, భావసంబంధమైన లోకము. "సువః" అనగా, సువర్లోకము. అదే ఆత్మతత్త్వం. పదార్థలోకము(దేహము), భావ లోకము

sri sathyasai vachanamrutam

(మనస్సు), సువర్లోకము (ఆత్మ) మూడూ మానవునియందు ఇమిడియున్నాయి.

**త్యాగమునకు పుట్టినిల్లు కేరళ**

ఈ లోకంలో భూదానము, గోదానము, అన్నదానము, సువర్ణ దానము చేసేవారున్నారుగాని, తమను తాము దానము చేసుకునేవారున్నారా? అట్టి దానము చేసిన త్యాగశీలి బలిచక్రవర్తి. కేరళ త్యాగమునకు పుట్టినిల్లు. భక్తిప్రపత్తులకు ఆటపట్టు. కాలప్రభావముచేత కొన్ని మార్పులు సంభవించి యుండవచ్చుగాని, ప్రాచీనకాలమునుండి భారతదేశములో త్యాగ భావమునకు, భక్తిప్రపత్తులకు కేరళ వాసిగాంచినది. 'దేహి' అంటూ చేయిజాచిన వ్యక్తికి 'లేదు' అని చెప్పే వ్యక్తి అక్కడ లేడు. అటువంటి పుణ్యభూమియందు బలి చక్రవర్తి పుట్టాడు. గురువాజ్ఞను సైతం ధిక్కరించి తనను తాను దైవానికి అర్పితం గావించుకున్నాడు. తండ్రిఆజ్ఞను సైతం ధిక్కరించి హరికి తనను తాను అర్పితం గావించుకున్న పరమభక్తుడైన ప్రహ్లాదుడుకూడా అక్కడే పుట్టాడు. కొంతమంది సైంటిస్టులు భగవంతుడే లేడంటారు. ఇది చాలా పొరపాటు. "ఇందుగలడందు లేడని సందేహము వలదు..." అని ప్రహ్లాదుడు ఘంటాపథంగా చాటిచెప్పాడు. అతని తండ్రియైన హిరణ్యకశిపుడు ఈనాటి సైంటిస్టు లందరినీ మించిన గొప్ప సైంటిస్టు. అతడు సూర్యమండలము, నక్షత్రమండలములకుకూడా వెళ్ళాడు. అంతటి శక్తి సామర్థ్యములు కలిగికూడా దైవత్వాన్ని కించిత్తైనా గుర్తించుకో లేకపోయాడు. దైవాన్ని కనుక్కోవాలంటే ఒక్క ప్రేమతత్త్వము తప్ప అన్యమార్గము లేదు. ప్రేమతో మిమ్మల్ని మీరు అర్పితం చేసుకోవాలి.

**దేహము నీవు కాదు**

ముఖ్యంగా మీరు భగవత్తత్త్వాన్ని తెలుసుకోవాలంటే "అహం బ్రహ్మాస్మి" అనే వేదవాక్యాన్ని విశ్వసించాలి. 'అహం' (నేను) అనేదే బ్రహ్మ. అదే ఆత్మ, అదే జ్యోతిర్మయి, అదే నిత్యానందమయి. "నేను" అనే తత్త్వమునందే ఈ సృష్టి అంతయు ఇమిడియున్నది. "అయ్యా! నీవెప్పుడు వచ్చావు?" అని ఎవరైనా నిన్ను అడిగితే, "నేను నిన్న వచ్చాను" అని చెబుతావు. అయితే, నిన్న వచ్చినది ఎవరు – నీవా? దేహమా? వచ్చినది దేహమేగాని, నీవు కాదు. కాని, దేహమే 'నేను' అని భావించి "నేను నిన్న వచ్చాను" అని అంటున్నావు.

sri sathyasai vahini

తరువాత, నీవు రోడ్డుపై నడుస్తుంటే కాలుజారి క్రిందపడ్డావు. కాలు విరిగింది. అప్పుడేమంటున్నావు? "నా కాలు విరిగింది" అంటున్నావు. నిన్న దేహమే 'నేను' అనే భ్రాంతితో "నేను వచ్చాను" అన్నావు. ఈనాడు నీ కాలు విరిగేటప్పటికి "నా కాలు విరిగింది" అంటున్నావు. "నా కాలు" అన్నప్పుడు కాలు నీకంటే ప్రత్యేకంగా ఉండాలి కదా! కనుక, దేహము నీవుకాదు. 'నేను' అనేది దేహముకంటే ప్రత్యేకంగా ఉన్నది. ఇది నిత్య సత్యమైనది. ప్రతి వ్యక్తియందు ఇది సమానంగా ఉన్నది. అందరియందున్న దైవత్వము ఇదే. 'నేను' అనేదే మానవుని నిజ స్వరూపము. 'నేను' ఉన్నచోట భగవంతుడున్నాడు. ప్రతి ఒక్కరు ఇలాంటి విశ్వాసమును పెంచుకోవాలి. "నా దేహము, నా మనస్సు, నా కాలు, నా చేయి" అని అంటున్నావు. కాని, "నేనెవరు?" అని నిన్ను నీవు ప్రశ్నించుకుంటే, ఇవన్నీ నీవు కాదని స్పష్టమౌతుంది. ఇవి కేవలం బాహ్యమైన ఆకారమునకు మాత్రమే సంబంధించినవిగాని, ఆనందమునకు సంబంధించినవి కావు. ఆత్మతత్త్వము ఒక్కటే ఆనందమునకు సంబంధించినది. అదియే 'అహం'.

**ప్రతి మనిషిలోనున్న ప్రేమతత్త్వమే 'నేను'**

ప్రేమస్వరూపులారా! ధనమునుబట్టి చూస్తే 'వీడు లక్షాధికారి, వాడు బీదవాడు' అనే తేడాలుండవచ్చునుగాని, 'నేను' అనే ఆత్మ తత్త్వమునుబట్టి చూస్తే అంతా సమానమే. ప్రతి వ్యక్తియందు ప్రకాశించే ప్రేమతత్త్వమే 'నేను'. ప్రేమ లేని మానవుడే లేడు. కరెంటు ఉన్నప్పుడే బల్బులు వెలుగుతాయి. అదేవిధంగా, దేహములో 'నేను' అనే కరెంటు ఉండడంచేతనే కన్నులు చూస్తున్నాయి, చెవులు వింటున్నాయి, నోరు మాట్లాడగల్గుతున్నది. అయితే, చూసేవి కన్నులు కావు. కన్నులద్వారా చూస్తున్నది 'నేను'. కన్నులలోని ప్రకాశమే దైవత్వము. ఒక రూములో ఉన్న స్విచ్‌ని వేస్తే ఆ రూములో ఉన్న బల్బు మాత్రమే వెలుగుతుంది. కాని, ఇంటికంతా లైటు రావాలంటే మెయిన్ స్విచ్‌ని వేయాలి. దేహములోని సర్వాంగములకు 'నేను' అనేది మెయిన్ స్విచ్‌వంటిది. అదియే ఆత్మస్వరూపము. అదియే సత్యస్వరూపము. సత్యమే దైవము. ప్రేమయే దైవము. ఈ సత్యాన్ని మీరు గుర్తించుకుంటే

sri sathyasai vachanamrutam

ఇంక ఏ సాధనలూ చేయనక్కర్లేదు.

**ఆకారములు వేరు, ఆత్మతత్త్వం ఒక్కటే**

అందరికీ సాక్షీభూతుడై ఉన్న దైవము ఒక్కడే. ఒక్కొక్కరు ఒక్కొక్క రూపనామములతో ఆరాధిస్తున్నారుగాని, అన్ని రూపములూ, అన్ని నామములూ భగవంతునివే. "సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి." కనుక, అందరినీ గౌరవించాలి, అందరినీ ప్రేమించాలి. అప్పుడే మనము కూడా గౌరవమును పొందుతాము. మన ప్రేమను విశాలం గావించుకోవాలి. సంకుచిత భావము మంచిదికాదు. "దైవం మానుష రూపేణ". కనుక, ప్రతి వ్యక్తీ దైవస్వరూపుడే. మానవుడు సర్వశక్తిసంపన్నుడు. మానవుడే దైవస్వరూపుడు. ఎక్కడైనా చూడండి, దైవానికి మనుష్యాకారం కల్పించి ఆరాధిస్తున్నారు. మీరు ఆకారములను పురస్కరించుకొని భేదములకు చోటివ్వకూడదు. మనకు ఆకారము ప్రధానం కాదు. ఒక చిన్న ఉదాహరణ: మార్కెట్‌లో చిన్నపిల్లలను ఆకర్షించడానికి చక్కెర పాకంతో కుక్క, కోడి, జింక మొదలైన వివిధ జంతువుల బొమ్మలను తయారుచేసి అమ్మకానికి పెడతారు. 'ఏ బొమ్మైనా తీసుకోండి, రెండణాలే' అంటుంటారు. మీ పిల్లవాడు 'నాకు జింక కావాలి' అంటాడు. మీరు రెండణాలిచ్చి జింకబొమ్మను కొంటారు. మళ్లీ 'నాకు కోడి కావాలి' అంటాడు. రెండణాలిచ్చి కోడిబొమ్మను కొంటారు. ఇవి ఆకారములో వేరువేరు కావచ్చుగాని, వీటియందున్న చక్కెర ఒక్కటే. మీరిచ్చే రెండణాలు చక్కెరకోసమేగాని, ఆకారముకోసం కాదు. ఆకారమునకు మీరు విలువ ఇవ్వడం లేదు. ఆకారమును చూసి ఆకర్షింపబడేవాడు బాలుడు. అదేరీతిగా, రూపనామములను చూసి భ్రమించేవాడు పామరుడు; మూలాధార తత్త్వమును మాత్రమే లక్ష్యమునందుంచుకునేవాడు నిజమైన సాధకుడు, భక్తుడు. కనుక, ఆకారమును చూసి భ్రమించరాదు. ఆత్మభావమును పోషించుకోవాలి. ఆత్మను ప్రేమించాలి. అప్పుడు మానవుడే దేవుడైపోతాడు.

**మనస్సు ఒక దొంగవంటిది**

ఆత్మకు 'హృదయం' అని పేరు పెట్టాయి ఉపనిషత్తులు. దయతో కూడినది హృదయం. కరుణతోకూడినది హృదయం. అందరియందు ఆ ప్రేమతత్త్వము, ఆ కరుణాహృదయము

sri sathyasai vahini amrutam

ఉన్నప్పుడు ఇంక ప్రపంచములో అశాంతిగాని, ద్వేషముగాని ఎలా ఉండగలవు?! హృదయమనగా భౌతికమైన గుండె కాదు. సర్వవ్యాపకమైన ఆత్మ తత్త్వమే హృదయం. కనుక, హృదయాన్ని పవిత్రంగా పెట్టుకోవాలి. ఏవిధంగా? ఒక చిన్న ఉదాహరణ: మనవద్ద ఉన్న విలువైన వస్తువులను మనం దొంగలకు అందుబాటులోఉండేటట్లు పెడతామా? పెట్టము కదా! కాని, ఈనాడు మీరు దయ, ప్రేమ, సహనం ఇత్యాది విలువైన నగలను మనస్సనే దొంగదగ్గర పెడుతున్నారు. విలువైన నగలను దొంగదగ్గర పెడితే అవి మీకు చిక్కవు, దక్కవు. ఆ విలువైన వస్తువులకు హృదయాన్ని యజమానిగా పెట్టాలి.

**మనసునాధారముగ గొను మానవుండు**
**పశువుకంటెను హీనమై పతనమగును**
**బుద్ధినాధారముగ గొను బుధజనుండు**
**పశుపతిగ మారునని పల్కె పర్తిసాయి**

మనస్సు నిరంతరం చలిస్తూనే ఉంటుంది. కనుక, మనస్సును అనుసరించ కూడదు. మనస్సును ఆధారం చేసుకోవడంవలన మీ సాధనలుకూడా కుంటుపడుతున్నాయి. ప్రేమను, సత్యమును ఆధారం చేసుకోండి. అప్పుడే మీకు శాంతి చేకూరుతుంది.

**నేను తప్పక కేరళకు వస్తాను**

(ఇంతకుముందు ప్రసంగించిన) ఇరువురు కేరళ మంత్రులు స్వామిని తమ రాష్ట్రమునకు రావలసిందిగా కోరుతున్నారు. ఈతూరి నేను తప్పక కేరళకు వస్తాను. ఈ సంవత్సరమునుండి కేరళ సైన్సు, టెక్నాలజీ రంగాలలో అభివృద్ధికి వచ్చే అవకాశాలున్నాయి. కేవలం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలు మాత్రమే వీటిలో ముందంజ వేశాయని చెబుతున్నారుగాని, కేరళకూడా చాలా గొప్పదవుతుంది. త్వరలోనే కేరళ అన్నిరంగాలలోనూ ఆదర్శము చూపిస్తుంది. అనాదికాలమునుండి భారతీయసంస్కృతియందు ప్రధానమైన "సత్యం వద, ధర్మం చర" అనే ఆదర్శాన్ని ప్రకాశింపజేస్తోంది కేరళ. వర్షములు మొట్టమొదట కేరళలోనే ప్రారంభమౌతాయి. అన్నింటికీ కేరళయే ప్రధానమైనది. అలాంటి ప్రదేశము భగవంతునికి మాత్రం ప్రీతికరం

sri sathyasai vachanamrutam

కాకుండా ఉంటుందా? సిద్ధాశ్రమం ఉన్న ప్రదేశం అది. సకల వాంఛలను సిద్ధింపజేయునది, సర్వసిద్ధులకు నిలయమైనది సిద్ధాశ్రమం. అందువల్లనే విశ్వామిత్రుడక్కడికి వెళ్ళి తపస్సు చేశాడు. బలిచక్రవర్తి, వామనమూర్తి, ఇంకా గొప్పగొప్ప మహర్షులందరూ కేరళయందే పుట్టారు. కొంతమందికి ఈవిషయం తెలియకపోవచ్చు - విశ్వామిత్రుడు సన్యాసం స్వీకరించడానికి పూర్వం గొప్ప రాజుగా ఉండేవాడు. సన్యాసం స్వీకరించిన తరువాత రాజర్షి అనిపించుకున్నాడు. కాని, వసిష్ఠునివలె తానుకూడా బ్రహ్మర్షి అనిపించు కోవాలని దీక్షబూనాడు. కట్టకడపటికి తాను ద్వేషాన్ని జయించి వసిష్ఠుల వారివలె బ్రహ్మర్షి అయినాడు. ప్రకృతి, పరమాత్మలకు ప్రతీకలైన సీతా రాములను కలిపాడు. అసలు అతను వచ్చిన పని అదే. తాను సంకల్పించుకున్నది సిద్ధింపజేసుకొని అరణ్యానికి వెళ్ళిపోయాడు.

ప్రేమస్వరూపులారా! విశ్వామిత్రునివలె మీరుకూడా భగవత్ప్రేమను పెంచుకోండి. ద్వేషము చాలా చెడ్డది. కనుక, ఎవ్వరినీ ద్వేషించ కండి. మీ విరోధినికూడా ప్రేమించండి. అప్పుడు మీరుకూడా గొప్ప మహర్షులుగా రూపొందుతారు.

**(2002 ఆగస్టు 21వ తేదీ ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)**

sri sathyasai vacharamrutam